# విలువలు

కుమారి కె. హనుమాయమ్మ



సాయంత్రం పూట మల్లెపందిరి ప్రక్కన శరత్ 'దేవదాసు' చదువుతున్న నేను, యెవరో వచ్చినట్లు అలికిడైతే వులికిపడి గేటువైపు చూసాను. ఆ వచ్చింది నా స్నేహితురాలు జయ. "అబ్బ! ఎన్నాళ్లయిందే నిన్ను చూసి, రారా! చాలా మారిపోయావుసుమా! అమ్మ, తమ్ముడు, చెల్లాయి, ప్లస్ నీ వుద్యోగం. అంతా క్షేమమేనా? అన్నట్లు నీకు పెళ్లి నిశ్చయమైనదిట కదూ!" అని యింకా ఏదో అడగబోతూ, విసుగుతో కూడిన నవ్వుతో నా వైపు అలాగే చూస్తూ నిలబడి పోయిన జయను చూసి, అతిగా వాగేస్తున్నా నన్నవిషయం గుర్తుకురాగా చిన్నగా నవ్వేశాను.

జయ మాత్రం నా వైపు యిలా సూటిగా చూసి, "నీకు బుద్ధిలేదు" అని స్టేట్‌మెంట్ నా ముఖానపడేసి, నాకు లేని తనకు వున్న బుద్ధేమిటో కనుక్కుందామనుకునే లోపలే ఇంట్లోకి మాయమైంది. జయ అలా లోపలికి వెళ్లిందంటే కొంపమునిగిందన్నమాటే! బామ్మని కాకాపట్టి ఏ జంతికలో, అరిసెలో టిఫిన్ కొట్టి, అమ్మతో కాస్సేపు బాతాఖానీ కొట్టి మంచి టీ తాగి, తిరిగ్గా అరగంట తర్వాత గానీ నాముఖం చూడదు. ఇలాపరిస్థితి విషమించకుండా వుండాలంటే, చెవిపట్టుకుని దాన్ని బయటకు లాక్కొచ్చేయటం వొక్కటే సుదూరంలో కనిపించే మార్గాంతరం. ఇది తక్షణం అమలు పెట్టాలని లోపలికి అడుగు పెట్టానో లేదో రివ్వున జయ దూసుకువచ్చి, ఒక చేత్తో టిఫిన్ ప్లేటు, మరో చేత్తో నా చేయి పట్టుకుని జరజరా మేడమీదకు లాక్కుపోయి 'ఠపీ'మని క్రిందకూలేసి, బలవంతంగా నా నోట్లో ఓచిన్న లడ్డూ ముక్క పెట్టి, సీరియస్‌గా నా వంకచూస్తూ :"అమ్మడూ! నేనో బుల్లికథ చెపుతాను, అడ్డు ప్రశ్నలేయకుండా విను!" అని నా అంగీకారంతో పనిలేకుండా చెప్పుకుపోసాగింది.

"అనగనగా ఓ అబ్బాయి! కొాటేరులాంటి ముక్కు కొనమీద సీమ పచ్చిమిరపకాయంత కోపంమాత్రం వున్న చిన్నవాడు, ఆధునికయుగంలోని ఆదర్శభావాలే ఆస్తిపాస్తులుగా, నాలుగువందల రూప్యముల వుద్యోగమే పురుషలక్షణముగా, యువతీ జనసంరక్షణమే అణువణువునా రంగరించుకున్న చక్కని అందగాడు. శ్రీధర నామధేయుండు ఒకడు గలడు...!"

"ఏచట?"

"ఇచట మాత్రము కాదు. రాజమండ్రి

యందు".

"ఉన్న మనకేమి ?"

"అతగాడిని నీ చెలికత్తెయైన ఈ జయ లక్ష్మికి జతగానిగా మన పెద్దలు... సారీ!... మా పెద్దలు నిశ్చయించినారు, గాన బంధు మిత్ర సమేతంగా, నువు మాత్రం వారం రోజులు ముందుగా విచ్చేయువలెను. రాకున్న కఠిన శిక్షవిధింపబడును. చెవిమెలిపెట్టి, బుగ్గ గిల్లి, యింకా..."

"స్టాప్! నీకు పెళ్లి—నాకు శిక్షా! ఇదెక్కడి మిత్ర ద్రోహమోయ్! అయినా నేను రాకుండా నీ మెడలో తాళికట్టటానికి ఆ శ్రీధర్ గార్కి ఎన్నిగుండెలు ?"

"కేవలం రెండు. అంతే!"

"అదేమిటి? నీగుండెగానీ ముందే ట్రాన్స్ ఫర్ చేశావా ?"

"కరెక్ట్! నిజం చెప్పొద్దూ! పెళ్లిచూపులకు వచ్చినపుడు యువతులు—పెళ్లిళ్ల సమస్యలు. కట్నాలు, ఆడపిల్లల తల్లి దండ్రుల అగచాట్లు వగైరాలను గురించి పెద్దస్పీచ్ దంచేసి, పైసా కట్నం తీసుకోకుండా, నిరాడంబరంగా పెళ్లి చేసుకుంటానని ఆ పెద్ద మనిషి అనేసరికి, నన్నునేను మరిచిపోయి, 'కట్నం యివ్వలేకపోయినా పిడికిలంత నా గుండెను కానుకగా యిస్తానులే!' అని కళ్లతో చెప్పాను. ఆ తర్వాత, అది నాదగ్గర కనిపించక ఖంగారుపడుతుంటే, "నీ హృదయం నా దగ్గరకు పదిలంగా చేరింది" అని అతని దగ్గర నుంచి లెటరు వచ్చింది. అదీ సంగతి!"

శ్రీధర్ ... రాజమండ్రి ... ఆదర్శం ... కట్నం తీసుకోక పోవటం...ఏదో సంఘటన నాకు లీలగా గుర్తుకు రాసాగింది.

"ఏయ్ నాటీ! పలకవేం!"

దోసిలిలోకి జయ ముఖం తీసుకుని "నా జయలూ! నువు నిజంగా అదృష్టవంతురాలివే!" ఎందుకో నా స్వరంలో నాకు తెలియకుండానే ఏదో మార్దవం తొణికింది.

"అందరూ అలాగే అంటున్నారు. కానీ ...నాకే ఒక్కోసారి యిది కలేమో, చేయి జారిపోతోందేమో అనిపిస్తోంది. ఈ అదృష్టం చాటున ఏవైన విషాదపు నీడలు దాగున్నాయేమోనని తడబాటు కలుగుతోంది. చాటుగా అమ్మలక్కలు 'అందగాడు, ఉద్యోగం చేస్తూ గూడా కానీ కట్నం తీసుకోవటం లేదంటే అతనిలో ఏదైనా లోపం వున్నదేమో' అనుకుంటున్నారట! అమ్మ చెప్పింది. నేను మాత్రం లెగించాను. నాన్న లేని నాకు, మా తాహతులో యింతమంచి సంబంధం ఎలా వస్తుంది ? అతనిలో ఏదన్నా లోపంవుంటే అది నా దురదృష్టం అనుకుంటాను. అంతే కానీ, ఒక సహృదయుడు, మంచి మనసుతో, నా లాంటి పేద పిల్లను పెళ్ళాడతానంటే, పిచ్చిపిచ్చి ఆలోచనలతో కాదనటం నాకు చేత కాలేదు! నువు చెప్పు! నా నిర్ణయంలో పొరపాటేమైనా వుందంటావా ?"

"జయా! నీ జీవిత సమస్యను గురించి యింతచక్కగా ఆలోచించి చేసిన నిర్ణయంలో పొరపాటు ఎందుకుంటుంది? జీవితంలో ఒకే ఒక్కసారి యెదురయ్యే అదృష్టాన్ని యింత చక్కగా వుపయోగించుకోగలిగిన నిన్ను తప్పక కంగ్రాచ్యులేట్ చెయ్యాలి! వేరే ఆలోచనలతో నీ మనస్సు పాడు చేసుకోకు. విష్ యు ఆల్ ది బెస్ట్! మరి, నీ వుద్యోగం ఎలా?రాజీనామా యిస్తున్నావా?"

"ఉహూఁ! తమ్ముడు, చెల్లెలు యింకా చిన్నవాళ్ళు, అమ్మకూడా ఒంటరిదే! వాళ్లను ఎలా వదిలేయను చెప్పు? నేను వుద్యోగం చేయటం వారికి యిష్టమే! నేను రాజమండ్రికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటానికి ప్రయత్నిస్తున్నాను, బహుశ రెండు నెలల్లో వీలు కావచ్చు! ఈ లోపల ఆషాఢ మాసం గట్రా వున్నాయిగా! ఆ తర్వాత అమ్మావాళ్లని నాతో తీసికెళ్లి పోతాను" అన్నది జయ నవ్వుతూ. అంతలోనే టైమ్ చూసుకొని, "మై డియర్ రోగ్! నేనిలా కబుర్లు చెపుతుంటే నా మీద మత్తుమందు గానీ జల్లుతావా, టైమ్ తెలియకుండా! ఈపాటికి అమ్మ ఆరడుగుల ఎత్తున ఎగురుతూ పేరిణీ నృత్యం చేస్తుంటుంది నేనింకా రాలేదని. మళ్లీ మళ్లీ బతిమాలించుకోక మంచిపిల్లలా వారం రోజులు ముందు వచ్చేయ్! షాపింగ్ అంతా మనదే!రాకపోతే నీ జత పచ్చి!"అంటూ వెడ్డింగ్ కార్డు నా ముందుంచి వెళ్ళబోతూ, 'అరె' అని చటుక్కున ముందుకువంగి నాబుగ్గ మీద ముద్దు పెట్టుకుని, ఎంత హడావుడిగా వచ్చిందో, అంత త్వరగా వెళ్లిపోయింది జయ.

అనాలోచితంగా వెడ్డింగ్‌కార్డు చూస్తున్న దృక్కులు 'శ్రీధర్' అన్నచోట ఆగిపోయాయి. నా ప్రమేయం లేకుండానే మూడు నెలల క్రిందట మా యింట్లో జరిగిన సంఘటన నాకళ్ళముందు కదిలింది...

"ఒరే రావుడూ! నువ్వు లక్ష చెప్పు! కోటి చెప్పు! నాకీ సంబంధం ససేమిరా నచ్చ లేదు! అబ్బాయి బియ్యే చదివాడుట! లక్షణంగా వుద్యోగం చేసుకుంటున్నాడట! కట్నంమాత్రం అక్కర లేదుట! పిచ్చివాడివి నువ్వు పుజలాట పడుతున్నావుగానీ, ధనం ఎవరికైనా చేదుటా ! ఆ అబ్బాయిలోనో, ఆవంశంలోనో ఏదో లొసుగు వుంది. అది కప్పిపుచ్చటానికి ఆదర్శమని పెట్టి, పసి పూసిన మారేడు కాయను మనకంటగడదామని వాళ్ళ ఎత్తురా అబ్బీ!"

"అయ్యో! అదికాదే అమ్మా! ఈనాటి కుర్రవాళ్లకు అదో మోజు. అదో వుత్సాహం! అంతేగానీ, నిక్షేపంలాంటి అబ్బాయికి లోపం అంటగడితే ఎలా ?"

"అహా! అలాగేం! నేను పెద్దదాన్ని, నాకు తోచిన మంచేదో నేను చెప్పాను. నీ కూతురి కిష్టమైందని దాని మాటకే విలువిచ్చి, ఈ సంబంధమే ఖాయం చేసేట్లయితే మేందేనికి ? మా పెద్దరికాలు దేనికి ? సాయంత్రమే కాశీకిపోతాను! ఛస్తే మీ గడప తొక్కను!" అంటూ ధరాలున బామ్మ లోపలికి వెళ్లిపోయింది.

వెంటనే అమ్మ అందుకుని "చూడండి! మనకు పెద్ద ఆస్తులేమి లేకపోయినా, అది చివరిపిల్ల మనకు అచ్చట, ముచ్చట తీర్చుకోను యింకా ఎవరున్నారు గనక. అనక మనం కలో, గంజో తాగినా పిల్ల మంచి కంపెకావాల్సిందేముంది? లక్షణంగా వున్నంతలో కట్నంయిచ్చి వైభవంగా పెళ్లి చేయక, నిరాడంబరంగా చెయ్యాల్సిన ఖర్మ మనకేం పట్టిందండీ ? చిన్నపిల్ల! అది చెప్పినట్లు విని అత్తగారి మనసు నొప్పించకండి!"

పాఠాలువలనేకాదు -
పాటలతోనూ ఆటలతోనూకూడా
పసివాళ్ళమనసుల్ని పెంచొచ్చని
అనిపంతులమ్మ
సందేశమిచ్చిన
చిత్రం!
దేవుడు చేసిన పెళ్లి

"నువ్వా అలా అంటావేం రాజ్యం ? ఇరవై యేళ్లు నిండిన నీ కూతురు యింకా చిన్నపిల్లా! దాని భవిష్యత్తు గురించి అది ఆలోచించుకోలేదూ ?"

## వి లు వ లు

"అయితే యిదే మీ చివరి నిశ్చయమన్న మాట ! ముగ్గురాడపిల్లలకి ఘ న ం గా పెళ్లిళ్లు చేసి, దీన్ని బతుకిలా చేస్తారా ? పెద్ద వారౌతున్నకొద్దీ మీకు బొత్తిగా మతి పోతున్నది ! మీరిలాగే చేస్తానంటే నేనే నుయ్యో, గొయ్యో చూసుకోవటం ఖాయం!" అంటూ నిష్క్రమించింది అమ్మ.



"ఏదో పేద వాళ్లింట్లో పెళ్లిలాగా నిరాడంబరంగా జరిగితే చూస్తూ ఊరుకోగల్గిన ఓర్పు 'మీ బావకు కట్నం ఎంతరా' అని మా ఫ్రెండ్స్ అడిగితే 'మా బావ ఆదర్శ పురుషుడోయ్! అందుకని కట్నం తీసుకోలేను!' అని చెప్పుకోగలిగే ఉదారత నాలో లేదు! నాకీ పెళ్లి అభిలాష లేదు!" అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసి బయటకు వెళ్ళిపోయాడు అన్నయ్య.

నిస్సహాయంగా నా వంక చూసే నాన్నకు ఏ బదులూ యివ్వలేక ఉబికి వచ్చే కన్నీటిని ఆపుకుంటూ నిశ్శబ్దంగా నా గదిలోకి వెళ్లిపోయాను.

మూఢ నమ్మకాల బొమ్మ...

మూర్ఖపు పట్టుదల గల్గిన అమ్మ...

స్నేహ భాషలో మాత్రమే ఆధునికత గల్గిన అన్నయ్య ...

వీళ్ళని ఎదిరించి నేను పొందలేని వ్యక్తిని జయ పొందుతున్నదని తెలిసినప్పుడు. ఆ వ్యక్తి విలువ మరెన్నో రెట్లు పెరిగినట్లనిపించింది నాకు నిశ్చయంగా ఇది అసూయ కాదు... ఆదర్శాన్ని అర్థం చేసుకోలేని పెద్దల నిర్ణయాన్ని ఎదిరించలేని నా అశక్తత...!

"అమ్మాయ్! ఇంకా మేడమీద ఏం చేస్తున్నావ్? చీకటిపడినా లైటు వేసుకోలేదూ? త్వరగా భోజనానికి రారాదూ, మీ అన్నయ్య, నాన్నగారూ వచ్చేసరికి పొద్దు పోవచ్చు..!" అమ్మ పిలుపుతో ఆలోచనలను అవతలకు నెట్టి వేస్తుంటే నా ఒళ్ళోంచి జారిపడ్డాయి జయ వెడ్డింగ్ కార్డు, శరత్ 'దేవదాసు'. ఎన్నిసార్లు చదివినా ఆ పుస్తకంలో చైతన్యవంతంగా అనిపించే ఒకే ఒక్క వాక్యం: "నీ పాదాల వద్ద నాకింత చోటియ్యి దేవదా!" అన్న పార్వతి మాటలు గుర్తుకు వచ్చాయి కానీ, ధైర్యంగా ఆ చేయి అందుకోలేని దేవదాసు, తన జీవితం అంతా పరితపించినా తిరిగి ఆ అవకాశాన్ని పొందలేక పోయాడు. ప్రతి మనిషి జీవితంలో ఒక్కసారి మాత్రమే అదృష్టంగా వెతుక్కుంటూ వచ్చే అవకాశాన్ని చేజారవిడుచుకుంటే అదే మరొకరి చేతచిక్కి, మరింత విలువను సంతరించుకొని, మనం పోగొట్టుకున్న దాని విలువ ఎంతో కొట్టొచ్చినట్లు వ్యక్తపరుస్తుంది. ఈ ఆలోచనే ముందుంటే ...' కళ్ళల్లో నిలిచిన నీటి తెరలు చూపుకు అడ్డంనిలిచి, నా చుట్టూ చీకటిని మరింత చిక్కంగా చేశాయి.

# ఆడమనసు

## శ్యామల

*[గత సంచిక తరువాయి]*

తల పగిలిపోతున్నట్లున్నది అతనికి. "నేను కావాలని నీవంటే అనురాగం పెంచుకోలేదు నాకు తెలియకుండానే ఈ భావం పెరిగి నా హృదయమంతా నిండిపోయింది నీవు కోరి నట్లే రత్నని పెళ్లిచేసుకొని-నీపట్ల ప్రేమని మర్చిపోయి-నన్ను నేనే మోసం చేసుకొని - మా యిద్దరికీ శాంతి లేకుండా చేయమంటావా? నీవే చెప్పు!"

నిశ్శబ్దంగా దొర్లాయి కొన్ని నిమిషాలు.

"అన్నీ ఆలోచించి నీవే చెప్పు కుసుమా, ఏం చేయమంటావో అట్లాగే చేస్తాను." ఈసారి అతని స్వరంలో ఆవేశంలేదు నిరాశ నిస్పృహ, అంతకుమించిన బాధ ఉన్నాయి

ఒక్క నిమిషం ఆగి ఆమె చెప్పింది. ఆమె స్వరం నిశ్చలంగా, ఏ భావమూ వ్యక్తం చేయకుండా ఉన్నది "ఒక్కోసారి సహజంగా మొలకెత్తిన భావానికి తలఒగ్గడమే మంచిదనిపిస్తుంది కాని ఆవిధంగా చేయటంవలన మరో వ్యక్తి మనసు ముక్కలు పడుతుందనుకుంటే, అట్లా చేయరాదనీ అనిపిస్తుంది ప్రేమాభిమానాలు మనోధార్ఢ్యాన్ని ఇంతగా పరీక్షించగలవని ఇప్పుడే తెలుస్తున్నది! నేను నిన్నెప్పుడూ రత్న భర్తగానే ఊహించాను ఆనందించాను. కాని వంశీ, నీవు వచ్చిన ఈ నెల రోజుల్లో నాకు ఏమయిందో నాకే తెలియటంలేదు. ఎప్పుడో తెలియకుండా హృదయంలో ఒక బీజం పడింది. అది మొలకెత్తి మానై ఇంతటి తపన, ఇంతటి ఆరాటం కలిగిస్తున్నది. ప్లీజ్... వంశీ నాకు చేయూతని ఇవ్వు... మనిద్దరం ఈ ప్రేమని జయించాలి. మరొక వ్యక్తిని బాధించరాదు."

బరువుగా ఊపిరి తీసుకొని అన్నాడతను "నీవు అడిగినది ఏదీ కాదనలేను." అప్రయత్నంగానే ఆమె భుజాలపై న్న అతని చేతులు ఆమె చెక్కిళ్లపైకి జరిగాయి. తన చేతుల్లో ఉన్న ఆమె ముఖాన్ని దగ్గరకు తీసుకొని ఆ లోతైన నల్లని కళ్లలోకి ప్రేమగా చూశాడు వాటిల్లో నీరు నిండివుంది. కన్నీటితోపాటు ఉన్న ఏదో కాంతి అతన్ని చూపులు మరల్చుకోనివ్వటంలేదు ఆమె బుగ్గల్లోనించి చెప్పని ఆవిర్లు చిమ్ముతున్నాయి పరిసరాలని మరచి తదేకంగా

### ఇంటింటి చిట్కాలు

* కర్పూరం ఆవిరి గాకుండా భద్రపరచాలంటే కర్పూరపు డబ్బాలో కాస్త బియ్యంగాని, నాలుగు మిరియాలు గాని వేసి యుంచండి
* ఫ్లాస్కులో కాఫీ వేడిగా ఉండాలంటే ఫ్లాస్కునిండా కాఫీ పోసి వుంచాలి
* వేడిపాలనే ఫ్లాస్కులో ఉంచుకోవాలి చల్లని పాలయితే విరిగిపోతాయి
* కాయగూరలలో విటమిన్లు నశించక ఉండాలంటే ముక్కలను పెద్దవిగా తరుగాలి!

— శ్రీమతి ఎస్. భువనేశ్వరమ్మ.


'జీవితమే ఒక నాటకమైతే
మీరు ఆడుతుపాడుతు పోగలరు!
తాతినేని చలపతిరావు
సంగీత స్వరాలు
కలకాలం మీ నోట పలికే
ఆనందగీతాలు
వినండి!
శ్రీలక్ష్మి వారి
దేవుడు చేసిన పెళ్లిలో